క్లుప్తంగా

ముకుందాపురం వాసికి డాక్టరేట్


అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో సైదయ్య

నిడమనూరు : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన సలికంటి సైదయ్యకు ఉస్మానియా యూనివర్శిటీ వారు వృక్ష శాస్త్రంలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్న సైదయ్య అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. కరుణాకర్‌రెడ్డి పర్యవేక్షణలో 'టైలోఫోర్ ఇండియా' అనే మొక్క మీద పరిశోధనా వ్యాసాలు సమర్పించారు. ఈ పరిశోధనలకు గాను సైదయ్యకు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సైదయ్యకు డాక్టరేట్ రావడంపై కాలేజీ యాజమాన్యం, బంధువులు, విద్యార్థులు అభినందించారు.

సీజ్ చేసిన వాహనాలకు వేలం

దేవరకొండ : వివిధ కేసుల్లో దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన 17వాహనాలకు శుక్రవారం దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ సమక్షంలో వేలం నిర్వహించారు. టూవీలర్, ఫ్లోర్ వీలర్ 17వాహనాలకు సంబంధించి అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 15 ద్విచక్ర వాహనాలు, రెండు ఫ్లోర్ వీలర్ వాహనాలకు గాను రూ.7లక్షల58వేల740ల ఆదాయం వచ్చినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సూర్యప్రకాష్, రవికుమార్, మధు, సిబ్బంది, పాల్గొన్నారు.

జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలి

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యా, వైద్య స్త్రీ శిశు సంక్షేమ రంగాలతో పాటు విద్యుత్‌కు సరైన కేటాయింపులు చేయలేదని ఎం సీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో బడ్జెట్‌లో జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయింపులు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్లాయయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వస్కుల మట్టయ్య, నాయకులు జ్యోతి, సందీప్, కాశీ, కిరణ్, వెంకన్న, కృష్ణ, రాంబాబు, నరేష్ తదితరులున్నారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 14న భారతీయ మజ్దూర్ సంఘ్–తెలంగాణ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమం వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అందె శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.21వేలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నర్సింహ, రవి, నాగయ్య, హనురెడ్డి, వెంకటేష్, లింగయ్య పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యకర్తకు ఆర్థిక సాయం

మిర్యాలగూడ అర్బన్ : జనసేన పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ క్రియాశీలక నాయకులు చిన్న వీరయ్య ప్రమాదవశాత్తు గాయపడటంతో ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పీఏసీ సభ్యులు నాగబాబు లు రూ.50వేల ఆర్థిక సాయాన్ని హైదరాబాద్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సతీష్‌రెడ్డి, జిల్లా నాయకులు నాగేశ్వర్‌రావు, పూర్ణచందర్‌రావు, వెంకట్, శ్రీను, అశోక్, గోపి, మల్లేష్, కృష్ణనాయుడు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మిర్యాలగూడ : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో గతంలో కంటే వ్యవసాయానికి రూ.50వేల కోట్ల కోత పెట్టారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వాయి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆయన దహనం చేసి మాట్లాడారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి కోత విధించడం దారుణమని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన మోదీ రైతుల అప్పులను రెట్టింపు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోడిరెక్క వెంకన్న, నాయకులు పుట్టల సైదులు, ఏసు పాల్గొన్నారు.

బీఎల్ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం కింద నియోజకవర్గంలోని ప్రతి ఆడపిల్లల భవిష్యత్ కోసం బీఎల్ఆర్ రూ.250 చెల్లించడం గొప్ప విషయమని తక్కెళ్లపాడు, జంకుతండా గ్రామాల కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం బీఎల్ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి పేదింటి ఆడపిల్లల చిరునవ్వు కోసం బీఎల్ఆర్ ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

● సబ్ స్టేషన్ కార్యాలయాల ఎదుట రైతుల ధర్నా


కొండమల్లేపల్లి : విద్యుత్‌సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు


చందంపేట లో..

పెద్దవూర : అప్రకటిత విద్యుత్ కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం చెందిన ఊట్లపల్లి, పులిచర్ల, పెద్దగట్టుతండా గ్రామాల రైతులు శుక్రవారం మండలంలోని పులిచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. సబ్‌స్టేషన్ సిబ్బందితో గొడవ పడి కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఐదు గంటలు కూడా రావడం లేదని, క్షేత్రస్థాయిలోకి వచ్చి చూస్తే రైతుల పరిస్థితి ఎంటో అర్థమవతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్లు, బావులను నమ్ముకుని యాసంగిలో వరి నాట్లు వేశామని, అప్రకటిత కోతలతో విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాత్రి సమయాలలో సైతం బోర్లు, బావుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. పూత, కాత దశలో ఉన్న మిరప చేలతో పాటు, బత్తాయి తోటలు సైతం ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డంపల్లి నర్సిరెడ్డి, హాతీరాం, లాలునాయక్, బాలునాయక్, నాగ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

చందంపేట : విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం మండలంలోని చిత్రియాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య మాట్లాడుతూ విద్యుత్ కోతలతో పంటలకు నీరు సరిగా అందించలేని పరిస్థితి ఉందని, విద్యుత్ కోతలు తీవ్రంగా ఉండడంతో రైతాంగం నష్టపోవాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండలంలోని పెండ్లిపాకలలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు శుక్రవారం లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లో ఓల్టేజీతో పంటలకు నీరు అందక ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు రైతులకు నచ్చజెప్పడంతో రైతులు శాంతించారు.

గుర్రంపోడు : మండలంలో మూడు రోజులుగా రోజు మూడు గంటలు కూడా కరెంటు సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి చేలు తడారి పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రోజూ రెండు, మూడు గంటలకు మించి కరెంటు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారలను ప్రశ్నించగా సింగరేణిలో సరఫరాలో ఏర్పడిన సాంకేతిక సమస్య వల్ల రోజు పగటి పూట మూడు గంటలకు మించి కరెంటు ఇవ్వలేక పోతున్నామని, రాత్రి పది గంటల తర్వాత త్రిఫేజ్ ఇస్తున్నామని, రెండు రోజుల వరకు ఈ సమస్య ఉండవచ్చునని అంటున్నారు.

బుద్ధవనంలో సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేయాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : ప్రపంచ పర్యాటక కేంద్రంగా నాగార్జున సాగర్‌ను గుర్తించి మరింత అభివృద్ధి పర్చడంతో పాటు సాగర్‌లోని బుద్ధవనంలో సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఆచార్య నాగార్జునుడు నడియాడిన ప్రాంతం నాగార్జున సాగర్ అని, సాగర్ పర్యాటక కేంద్రంలో ప్రపంచస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు బుద్ధిజం ప్రజ్వరిల్లిన ఆధ్యాత్మిక ప్రదేశం బుద్ధవనంలో సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. స్పందించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సాగర్ పర్యాటక కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని చందంపేట మండలం కంబాలపల్లి, పొగిళ్ల గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల భూమి నిషేధిత జాబితాలో ఉందని, వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ఈ మేరకు ప్రస్తావించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురై భూ నిర్వాసిత గ్రామాలైన కంబాలపల్లి, పొగిళ్ల గ్రామాల రైతులకు డి– ఫామ్ పట్టాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. భూములు నిషేధిత జాబితాలో ఉండడం వల్ల క్రయ విక్రయాలు జరుగక పోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించి రైతుబంధు అందేలా చూడాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


హజారిగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని హజారిగూడెంలో ఎమ్మెల్సీ సహకారంతో మంజూరైన సీడీపీ నిధులు రూ. 10లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల, తిరుమలగిరి మండలాల ఎంపీపీలు సుమతిపురుషోత్తం, ఆంగోతు భగవాన్‌నాయక్, తిరుమలగిరి మండల జెడ్పీటీసీ సూర్యభాష నాయక్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రావుల చిన బిక్షం యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబు యాదవ్, మాజీ ఎంపీపీ పెద్దిరాజు యాదవ్, సర్పంచ్‌లు పద్మ వెంకటేశ్వర్లు, సంధ్యారాము నాయక్, కిరణ్‌నాయక్, ఉప సర్పంచ్ జబీన్ జలీల్‌పాషా, నాయకులు లక్ష్మణ్ నాయక్ మధుసూదన్‌రెడ్డి, రాంబాబు, బాస్కర్‌రావు, బాబు, రామకృష్ణ, పుల్లారెడ్డి, బుగ్గయ్య, వెంకన్న, హాజీ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక పంటల సాగు రైతులకు నగదు ప్రోత్సాహకం


రైతులకు అగ్రిమెంట్ ప్రతులను అందజేస్తున్న గ్రామ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి

గుర్రంపోడు : దీర్ఘకాలిక పంటలు సాగు చేసే రైతులకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఐక్యరాజ్యసమితి అందజేస్తున్న కార్బన్ క్రెడిట్స్ నగదు ప్రోత్సాహకాలను ప్రతి రైతు వినియోగించుకోవాలని ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ టి. అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో రైతులకు అగ్రిమెంట్ ప్రతులను పంపిణీ చేసిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్బన్ క్రెడిట్స్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఇరవై ఏళ్లపాటు ప్రతిఏటా నగదు ప్రోత్సాహకం అందుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని, డిసెంబర్ నెలలో వీరి ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. 'ది పయనీర్ ఆగ్రోఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ భద్రాచలం' ఆధ్వర్యంలో ఈ పథకం అమలు అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుత్తా తిరుమల్‌రెడ్డి, గ్రామ రైతు నాయకులు కాసర్ల ధర్మయ్య, పోలేని పెంటయ్య, సోమగాని యాదయ్య, అంజయ్య, శివ ప్రసాద్, కృష్ణయ్య, ఊషయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై కాలనీవాసుల హర్షం

మిర్యాలగూడ అర్బన్ : ఎన్నో ఏళ్లుగా రోడ్డు సరిగా లేక ఇబ్బందులుడుతున్న తమకు ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్డు నిర్మించడంపై రవీంద్రనగర్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సీసీ రోడ్డు వద్ద కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధనమితి నాయకులు చేగొండి మురళీయాదవ్, రవీంద్రభారతి స్కూల్ కరస్పాండెంట్ కందు మదుసూదన్‌రెడ్డి, ఎలమంచిలి శ్రీనివాస్‌రారావు, బ్రహ్మాచారి, జగన్, శ్రీను, రఘు, రాజు, పరమేష్, మల్లయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ జాడీ రాజు

మిర్యాలగూడ టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్త డాక్టర్ జాడీ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు మాడ్గుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పేరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో కూడా హత్యను సమర్థిస్తూ అనుచిత వ్యాఖ్యలను చేశాడని ఆరోపించారు. గాంధీని గాడ్సే చంపినట్లుగా అంబేద్కర్ రాసిన పుస్తకాన్ని చదివే సమయానికి తాను ఉంటే మరో గాడ్సేలాగా చంపేవాడినని హమారా ప్రసాద్ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు చేసినందునా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి బాబురావు, శ్రీరాములు, ఏర్పుల జనార్ధన్, పాల్గొన్నారు.

నోటుబుక్స్ అందజేత

మిర్యాలగూడ : మండలంలోని ఈదులగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు శుక్రవారం బంజారా మహిళ ఎన్‌జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్, నవ్యవరెడ్డి, నవ్యరెడ్డి సంయుక్తంగా నోట్ బుక్స్, పెన్నులను ఉచితంగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కళావతి, ఈసీ గోపాల్, బాలునాయక్, గోవింద్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

దేవరకొండ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటి, రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రగ్బీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రగ్బీ క్రీడకు సంబంధించి విద్యార్థులకు పలు మెళకువలు తెలిపారు. విద్యార్థులు తాము ఎంచుకున్న క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని వారు కోరారు. దేవరకొండ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్, శ్రీధర్, సురేష్, అన్వర్, రాజేష్ పాల్గొన్నారు.

తెలంగాణలో అతిపెద్ద రాజకీయ శక్తిగా బీజేపీ


మిర్యాలగూడ టౌన్ : మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి


దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్రంలో బీజేపీ అతిపెద్ద రాజకీయ శక్తిగా మారిందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఈదులగూడెం చౌరస్తా వద్ద పట్టణ బీజేపీ శక్తి కేంద్రాల ఆధ్వర్యంలో ×ప్రజా గోస బీజేపీ భరోసా' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఇదే మొదటి సభ అని, ఈనెల 25వ తేదీలోగా నియోజకవర్గంలోని అన్ని శక్తి కేంద్రాల్లో ఇలాంటి సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.బీజేపీ సీనియర్ నేత అమిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు అంతయ్య, వెంకటయ్య, రాఘవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ లచ్చిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, రాష్ట్ర నాయకులు సాధినేని శ్రీనివాస్‌రావు, పురుషోత్తంరెడ్డి, రమేష్, సైదులు, హన్మంతరెడ్డి, సరిత, శేఖర్, సీతారాంరెడ్డి, అశోక్‌రెడ్డి, గిరి, శ్యాం, ఈగా సైదారావు, వేణు, లక్ష్మణ్‌సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

చింతపల్లి : రాష్ట్రంలో అవినీతి నిరంకుశ, కుటుంబ పాలన సాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్‌లు ఆరోపించారు. 'ప్రజా గోస–బిజెపి భరోసా' కేంద్రాల్లో శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో దేవరకొండలో నిర్వహించిన సమావేశానికి వెళ్తూ శుక్రవారం మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ జర్పుల కల్యాణ్‌నాయక్, రమేశ్‌యాదవ్, వినోద్ నాయక్, అనీల్‌రెడ్డి, నగేశ్, మహేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ఒరిగిందేమీ లేదు

దేవరకొండ : గడిచిన ఎనిమిదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో ఒరిగిందేమి లేదని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ముత్యాలమ్మ బజార్‌లో నిర్వహించిన 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలు ఇస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్న అధికార బీఆర్ఎస్ పార్టీకి రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. పట్టణ ఉపాధ్యక్షుడు ఇడెం రవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, గుండాల అంజయ్య, గాజుల మురళి, పులిజాల లక్ష్మి, కల్యాణ్‌నాయక్, లాలూనాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగ జేఏసీ చైర్మన్‌గా నరసింహాచారి



మిర్యాలగూడ అర్బన్ : ఉపాధిహామీ ఉద్యోగ జేఏసీ నల్లగొండ జిల్లా చైర్మన్‌గా మిర్యాలగూడ క్లస్టర్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆర్.నరసింహ ఎన్నికయ్యారు. శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలు


నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తిరుమలగిరి మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. సంఘంలో తొమ్మిది మంది డైరెక్టర్ల కోసం నిర్వహించిన ఎన్నికల్లో అభ్యర్థులుగా పిట్టల కృష్ణ, చెన్నబోయిన లక్ష్మయ్యల ప్యానెల్ పోటీ చేసింది. సంఘంలో 113మంది ఓటర్లు ఉండగా 112 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పిట్టల కృష్ణ ప్యానెల్‌కు చెందిన సభ్యులు విజయం సాధించారు. తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు తొమ్మిది స్థానాలు పిట్టల కృష్ణ ప్యానెల్ గెలుచుకోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఆ ప్యానెల్‌కే దక్కనున్నాయి. ఈ ఎన్నిక జిల్లా మత్స్య శాఖ అధికారి షణ్ముకచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. నేడు చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

బాల్ బాడ్మింటన్ పోటీలకు గురుకుల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రప్రసాద్

మిర్యాలగూడ టౌన్ : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 12 వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మిర్యాలగూడలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు శుక్రవారం మిర్యాలగూడ నుంచి బయలుదేరినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. రవీంద్రప్రసాద్, పీటీయూ గురువయ్యలు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో 8వ తరగతి చదువుతున్న సుశాంత్, 9వ తరగతి చదువుతున్న బి.రాజేష్, మహిపాల్, 10వ తరగతి చదువుతున్న బి. రాజేష్‌లు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభాను కనబరిచి గురుకుల పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలని అలాగే ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీ లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ రాములు, సృజన్‌కుమార్, చైతన్య, భిక్షం, కోటి శ్రీనివాస్, నర్సింహ, రామలక్ష్మి, జానకమ్మ, శంకర్‌నాయక్, రామారావు, శేఖర్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు.

విద్యార్థుల మేధస్సుకు సైన్స్‌ఫేర్ పదును


కృష్ణవేణి స్కూల్‌లో ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న ఎంఈఓ బాలునాయక్

హాలియా : విద్యార్థుల మేధస్సుకు సైన్స్‌ఫేర్ కార్యక్రమం మరింత పదును పెడుతుందని అనుముల మండల ఎంఈఓ బాలునాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కృష్ణవేణి హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునాతన పోటీ ప్రపంచంలో విద్యార్థులు లక్ష్య సాధన దిశగా ముందడుగు వేస్తే విజయం తథ్యమన్నారు. నేటి ప్రపంచంలో సైన్స్ అవసరం ప్రతి వ్యక్తికి ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి మెరుగులు దిద్దాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన 120 నమూనాలను పరిశీలించారు. ఒక్కో నమూనా గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నిమ్మల లక్ష్మారెడ్డి, జలంధర్‌రెడ్డి, అలుగుల వెంకట్‌రెడ్డి, పాఠశాల ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేఎస్ఏటీలో 'శాస్త్ర' విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : అభ్యాసోత్సవ్–తెలంగాణ ఆధ్వర్యంలో కలాం సైంటిఫిక్ యాక్టివ్ టెస్ట్(కేఎస్ఏటీ) లెవల్–1 పరీక్షలను పట్టణంలోని శాస్త్ర స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో 300మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో శాస్త్ర స్కూల్‌కు చెందిన 14మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు స్కూల్ కరస్పాండెంట్ పి. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆ విద్యార్థులు ఈనెల 12న హైదరాబాద్‌లోని బాలపూర్ జూనియర్ కళాశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పోటీలకు హాజరుకానున్నారు. ఆ విద్యార్థులకు స్కూల్ చైర్మన్ ఎం. చంద్రశేఖర్ అభినందించారు. అదే విధంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన వారిలో స్కూల్ కరస్పాండెంట్ పి. శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మోహనకృష్ణ, ఇన్‌చార్జ్ పి. సింధు, తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల ముందస్తు అరెస్ట్

అడవిదేవులపల్లి : సెర్ప్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా తెల్లవారుజామున వీలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లను అడవిదేవులపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మండల యూనియన్ అధ్యక్షుడు కుర్ర నాగునాయక్ మాట్లాడారు. అరెస్టయిన వారిలో యూనియన్ అధ్యక్షుడు కుర్ర నాగునాయక్, వి మునీ, లక్ష్మణ్, జ్యోతి, భ్రమరాంబ, వెంకటేశ్వర్లు, చెన్నయ్య పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కొండమల్లేపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలని కొల్‌ముంతలపహాడ్ సర్పంచ్ రమావత్ రవినాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్‌ముతలపహాడ్ గ్రామపంచాయతీలోని పీహెచ్‌సీ సబ్ సెంటరలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని చైతన్యనగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులరు పాఠాలు బోధించారు. విద్యాశాఖ మంత్రిగా సీహెచ్ నిధి రూపిని, జిల్లా కలెక్టర్‌గా ఎం .స్పందనరెడ్డి, ఆర్‌జెడీగా ఆశ్రిత, డీఈఓగా ప్రవళిక, ఎంఈఓగా సాయిలక్ష్మిత్, ప్రిన్సిపల్‌గా సిద్ధార్థ, కరస్పాండెంట్‌గా అమూల్య, డైరెక్టర్‌గా అదిల్‌బాబాలు వ్యవహరించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీషా, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, వర ప్రసాద్, మల్లిఖార్జున్, నాగలక్ష్మి, పరమేశ్వరీ, ఫణి, రమేష్, విద్యార్థులు తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, ఝాన్సీలక్ష్మి, వెంకట్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, విజయ పాల్గొన్నారు.